దార్శనికుడు జ్యోతిరావు పూలే

జయంతి వేడుకల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు

జెడ్పీ కార్యాలయంలో పూలే విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

వందేళ్ల కిందటే బడుగుల హక్కులతో పాటూ స్త్రీ సమానత్వానికి బాటలు వేసిన దార్శనికుడు మహాత్మా జ్యోతిబా పూలే అని ప్రజాప్రతినిధులు, అధికారులు పేర్కొన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే 197వ జయంతి వేడుకలను జిల్లా వ్యాప్తంగా మంగళవారం నాడు ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్‌లోని జెడ్పీ కార్యాలయంలో వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పూలే విగ్రహానికి ఎమ్మెల్యే అనంత వెంకట్రామి రెడ్డి, జెడ్పీ ఛైర్ పర్సన్ బోయ గిరిజమ్మ, కలెక్టర్ ఎమ్.గౌతమి తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జెడ్పీ సమావేశ మందిరంలో పాఠశాల విద్యార్థులతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గౌతమి మాట్లాడుతూ విద్యతోనే మానవాలి ప్రగతి సాధ్యమని నమ్మిన వ్యక్తి పూలే అన్నారు. మహిళలను అబలలుగా చూసే రోజుల్లో తన భార్య సావిత్రిబాయికి సొంతంగా చదువు చెప్పారన్నారు. ఆయన జీవితం ఆ తర్వాతి తరాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహితీ, కోగటం విజయ భాస్కర్ రెడ్డి, ఆహుడా ఛైర్‌పర్సన్ మహాలక్ష్మి శ్రీనివాస్, రజక కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ మీసాల రంగన్న, ఆర్టీసీ రీజనల్ ఛైర్‌పర్సన్ మంజుల, నాటక అకాడమీ ఛైర్‌పర్సన్ హరిత, సీడబ్ల్యూసీ ఛైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి, జిల్లా బీసీ సాధికార, సంక్షేమ అధికారి ఖుష్బు కొఠారి, బీసీ కార్పొరేషన్ ఈడీ నాగముని, జెడ్పీ సీఈవో భాస్కర్‌రెడ్డి, ఆర్డీవో మధుసూదన్ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటన ఖరారు

- 17న నార్పలకు రాక
- విద్యార్థులకు వసతిదీవెన నగదు బదిలీ
- బహిరంగ సభ ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి-నార్పల

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి అనంతపురం జిల్లా పర్యటన ఖరారు అయ్యింది. ఈ నెల 17వ తేదీన ఆయన నార్పలకు రానున్నారు. నార్పలలో నిర్వహించ బహిరంగ సభ వేదిక నుంచి విద్యార్థుల వసతిదీవెన నగదును వారి ఖాతాల్లోకి బదిలీ చేయనున్నారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి ఏర్పాట్లను కలెక్టర్ ఎమ్.గౌతమి ఆధ్వర్యంలో మంగళవారం నాడు పరిశీలించారు. ఎమ్మెల్సీ తలశిల రఘురాం, జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, అనంతపురం ఆర్డీవో మధుసూదన్, ప్రభుత్వ విద్యాసలహాదారుడు ఆలూరు సాంబశివా రెడ్డి, అడిషినల్ ఎస్పీ నాగేంద్రుడు, డీఎస్పీ ప్రసాద్ రెడ్డితో కలిసి హెలీప్యాడ్, బహిరంగ సభ తదితర ఏర్పాట్లను పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటనకు వారం రోజులు కూడా గడువు లేనందున యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. బహిరంగ సభకు పెద్ద ఎత్తున వచ్చే వాహనాలకు పార్కింగ్ సౌకర్యం, ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా సభ నిర్వహించుకునేందుకు అనువైన విధంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పైలా నరసింహాయ్య, వైసీపీ సీనియర్ నాయకులు నార్పల సత్యనారాయణ రెడ్డి, మండల కన్వీనర్ నిట్టూరు రఘునాథరెడ్డి, జడ్పీ వైస్ ఛైర్‌పర్సన్ నాగరత్నమ్మ, ఎంపీపీ నాగేశ్వరరావు, తహశీల్దార్ నారాయణస్వామి, ఎంపీడీవో దివాకర్, వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి మిద్దె కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్లో సమీక్ష

అనంతపురం కలెక్టరేట్ : ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి అనంతపురం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్సులో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. అన్ని శాఖల అధికారులతో ఏర్పాట్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. అందరూ సమన్వయంతో పని చేసి ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, డీఆర్వో గాయత్రీ దేవి, అడిషనల్ ఎస్పీ నాగేంద్రుడు, ఆర్డీవో మధుసూదన్, ఆర్అండ్‌బి ఎస్ఈ ఓబుల్‌రెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ విశ్వమోహన్ రెడ్డి, పంచాయతీ రాజ్ ఎస్ఈ భాగ్యరాజ్, డీటీసీ శివరామప్రసాద్ పాల్గొన్నారు.

నార్పలలో సభా స్థలి ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ రఘురాం, కలెక్టర్ గౌతమి

ఫిజికల్, బయాలజీ సైన్స్‌కు ఒకే ప్రశ్నాపత్రం

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

ప్రస్తుతం జరుగుతున్న పదవ తరగతి పరీక్షల్లో ఒకే ప్రశ్నపత్రంలో ఫిజికల్ సైన్స్, బయాలజీ సైన్స్ ప్రశ్నలను ముద్రించినట్లు డిఇఒ ఎం.సాయిరామ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ ప్రశ్నపత్రంలో భాగము-ఎలో ఫిజికల్ సైన్స్ ప్రశ్నలు, క్రమ సంఖ్య 1 నుంచి 16 వరకు, భాగము-బిలో బయోలాజికల్ సైన్స్ ప్రశ్నలను క్రమ సంఖ్య 17 నుంచి 33 వరకు ముద్రించినట్లు తెలిపారు. జవాబులు రాయడానికి విడివిడిగా ఓఎంఆర్‌లు ఉన్న రెండు 12 పేజీలో జవాబు పత్రాలను అందించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు రెండు సబ్జెక్టులకు సమాధానాలు రాసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఫిజికల్ సైన్స్ జావాబుపత్రంలో ఫిజికల్ సైన్స్ సమాధానాలను, బయాలజీ సైన్స్ జావాబుపత్రంలో బయాలజీ సైన్స్ సమాధానం మాత్రమే రాయాలన్నారు. ఇన్విజిలెటర్లు పరీక్ష ప్రారంభానికి ముందు గదిలోని పదవ తరగతి విద్యార్థులందరికీ ఈ విషయంపై అవగాహన కల్పించాలని ఆదేశించారు.

11 టన్నుల ప్లాస్టిక్ సీజ్

రూ.లక్ష జరిమాన
ఇన్‌ఛార్జి కమిషనర్ రమణారెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశాల మేరకు మంగళవారం నగరంలోని పలు దుకాణాలపై టాస్క్ ఫోర్స్ టీమ్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి దాదాపు 11 టన్నుల ప్లాస్టిక్‌ను సీజ్ చేసినట్లు నగర పాలకసంస్థ ఇన్‌ఛార్జి కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో నిషేధించిన సింగిల్ యూజ్ ప్లాస్టిక్ అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో పొల్యుయషన్ బోర్డు అధికారులు, పోలీసు అధికారులు, నగరపాలక సంస్థ ఆరోగ్య విభాగంతో కూడిన సంయుక్త టాస్క్ ఫోర్స్ టీమ్ ఆధ్వర్యంలో నగరంలోని మహావీర్ ట్రేడర్, మహాలక్ష్మి ప్లాస్టిక్ దుకాణాల్లో దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా 11 టన్నుల నిషేధిత సింగిల్ యూజ్ ప్లాస్టిక్ గుర్తించి సీజ్ చేసినట్లు తెలిపారు. అలాగే రెండు దుకాణాలకు రూ.లక్ష జరిమాన విధించినట్లు తెలిపారు. నగరంలో ఎవరైనా ప్లాస్టిక్ వాడినా, అమ్మినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో నగరపాలక సంస్థ కార్యదర్శి సంఘం శ్రీనివాసులు, హెల్త్ ఆఫీసర్ గంగాధర్‌రెడ్డి, పర్యావరణ పరిరక్షణ అధికారి శంకర్‌నారాయణ, ఆర్.ఐ మురళీ, విఆర్ఒ నగరపాలక సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలను ఆలకిస్తూ..

- తాడిపత్రి నియోజకవర్గంలో మొదలైన యువగళం పాదయాత్ర
- భారీగా తరలొచ్చిన టిడిపి శ్రేణులు
- అడుగడుగునా లోకేష్‌కు ఘనస్వాగతం
- ఆద్యంతం కార్యకర్తలను ఉత్సాహపరిచిన జెసి.ప్రభాకర్‌రెడ్డి
- వివిధ వర్గాల వారితో లోకేష్ ముఖాముఖి

పాదయాత్ర చేస్తున్న నారా లోకేష్

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

సమస్యలను వింటూ.. వారి వినతులను స్వీకరిస్తూ.. భవిష్యత్తుపై భరోసాను ఇస్తూ నారా లోకేష్ యువగళం పాదయాత్ర కొనసాగింది. అనంతపురం జిల్లాలో జరుగుతున్న లోకేష్ యువగళం పాదయాత్ర మంగళవారం 67వ రోజుకు చేరుకుంది. శింగనమల నియోజకవర్గం నుంచి తాడిపత్రి నియోజకవర్గంలోకి యాత్ర ప్రవేశించింది. పెద్దపప్పూరు మండల పరిధిలోని సింగన్నగుట్టపల్లి గ్రామం నుంచి మైదలైన యాత్ర చాగల్లు, తబ్జూలు, పెద్దపప్పూరు, చిన్నపప్పూరు, గార్లదిన్నె, పసూలూరు గ్రామాల మీదుగా కొనసాగింది. పసులూరులో రాత్రికి బస చేశారు. చాగల్లు వద్ద భూ నిర్వాసితులు, బెస్త కులస్తులతో సమావేశం అయ్యారు. పెద్దపప్పూరులో దూదేకులు, బుడుగ జంగాలు, చేనేత కార్మికులతో ముఖాముఖి నిర్వహించారు. తాడిపత్రి నియోజకవర్గంలోని యాత్ర చేరుకోగానే టిడిపి శ్రేణులు ఘనస్వాగతం పలికారు. రోడ్డుకు ఇరువైపులా పసుపు జెండాలు బెలూన్లతో అలంకరించారు. మాజీ ఎమ్మెల్యే జెసి.ప్రభాకర్‌రెడ్డి, ఆయన తనయుడు జెసి.అస్మిత్‌రెడ్డి ఆధ్వర్యంలో లోకేష్‌కు అడుగడుగునా ఘనస్వాగతం పలికారు.

సమస్యలు వింటూ... వినతిపత్రాలు స్వీకరిస్తూ...

పెద్దపప్పూరు మండలంలో లోకేష్ పాదయాత్ర వివిధ వర్గాల వారితో సమావేశం అయ్యి, వారి సమస్యలను వింటూ, వినతిపత్రాలు స్వీకరిస్తూ సాగింది. సింగన్నగుట్టపల్లి గ్రామంలో చాగల్లు ప్రాజెక్టు కింద భూములు కోల్పోయిన వారు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ రాలేదని, టిడిపి హయాంలో నిర్మించుకున్న ఇళ్లకు కూడా బిల్లులు ఇవ్వడం లేదని తమకు న్యాయం చేయాలని లోకేష్‌ను కోరారు. చాగల్లు ప్రాజెక్టు వద్ద చేపలు పట్టే బెస్తకులస్తులు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. 2010 సంవత్సరం నుంచి చాగల్లు ప్రాజెక్టులో చేపలు పట్టుకుని జీవన సాగిస్తుండే వాళ్లమని, వైసిపి ప్రభుత్వం వచ్చాక జీవో నెంబర్ 217ను తీసుకొచ్చి రిజర్వాయర్‌లో చేపలు పట్టుకునేందుకు వీల్లేకుండా చేశారన్నారు. జీవోను తొలగించి తమకు న్యాయం చేయాలని కోరారు. పెద్దపప్పూరు గ్రామ శివారులో దూదేకుల కులస్తులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా దూదేకుల కులస్తులు మాట్లాడుతూ తమ కులానికి సంబంధించి విద్యార్థులకు టీసీల్లో హిందూ దూదేకులు అని రాస్తున్నారని, దీనిని సవరించి ముస్లిం దూదేకులు అని రాసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇలా చేయడం వల్ల ముస్లిములకు వర్తించే పథకాలూ తమకు వర్తిస్తాయని చెప్పారు. చట్టసభల్లో కూడా దూదేకులకు తగిన ప్రాధాన్యత కల్పించాలని కోరారు. పెద్దపప్పూరు రామకోటి కాలనీలో బుడుగజంగాలతో ముఖాముఖి నిర్వహించారు. చేనేత కార్మికులతోనూ సమావేశం అయ్యారు. టిడిపి అధికారంలోకి రాగానే యువగళం పాదయాత్రలో తన దృష్టికి తీసుకుని వచ్చిన సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని లోకేష్ హామీ ఇచ్చారు. ఆయా ప్రాంతాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. వైసిపి పాలనలో అన్ని వర్గాల ప్రజలూ ఇబ్బందలకు గురవుతున్నారని చెప్పారు. సంక్షేమాన్ని విస్మరించి పాలన సాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2024లో టిడిపి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఎవరూ అధైర్య పడాల్సిన అవసరం లేదని భవిష్యత్తు మనదే అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, జెసి.ప్రభాకర్‌రెడ్డి, జెసి.అస్మిత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ దీపక్‌రెడ్డి, టిడిపి పెద్దపప్పూరు మండల నాయకులు రామకష్ణారెడ్డి, భాస్కర్ రెడ్డి, లోక్‌నాథ్, టిడిపి కన్వీనర్ రఘునాథ్ రెడ్డి, మైనార్టీ నాయకులు షెక్షావలి, భాస్కర్ రెడ్డి, హరినాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టిడిపి శ్రేణులకు అభివాదం చేస్తున్న నారా లోకేష్, జెసి.అస్మిత్‌రెడ్డి

లోకేష్‌కు ఘన స్వాగతం

లోకేష్‌కు అడుగడుగునా టిడిపి శ్రేణులు ఘనస్వాగతం పలికాయి. మాజీ ఎంపీ జెసి.దివాకర్‌రెడ్డి తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే జెసి.ప్రభాకర్ రెడ్డి, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జెసి.అస్మిత్ రెడ్డి పిలుపుమేరకు వేలాదిగా టిడిపి శ్రేణులు తరలొచ్చి లోకేష్‌కు అడుగడుగునా ఘన స్వాగతం పలికారు. యాత్ర సందర్భంగా టిడిపి కార్యకర్తలను మరింత ఉత్సాహపరిచేందుకు మాజీ ఎమ్మెల్యే జెసి.ప్రభాకర్ రెడ్డి ఓపెన్ టాప్ జీపుపై ఎక్కి డాన్స్ చేస్తూ కార్యకర్తలను ఉత్సాహపరిచారు.

ములకలపెంట గ్రామంలో కిడ్నీ వ్యాధిగ్రస్తులతో మాట్లాడుతున్న వి.రాంభూపాల్

ములకలపెంటను

మరో ఉద్దానం కానీయొద్దు..!

- తక్షణం గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేయాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్
- కిడ్నీ వ్యాధిగ్రస్తుల సమస్యలు తెలుసుకున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-గుంతకల్లు రూరల్

అనంతపురం జిల్లా గుంతకల్లు మండల పరిధిలోని ములకలపెంట గ్రామాన్ని మరో ఉద్దానం కానీయకుండా ప్రభుత్వం, జిల్లా అధికార యంత్రాంగం తక్షణం స్పందించి గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. కిడ్నీ సమస్యలతో సతమతం అవుతున్న ములకలపెంట గ్రామాన్ని మంగళవారం నాడు సిపిఎం నాయకులు సందర్శించారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులు, కుటుంబ సభ్యులతో మాట్లాడారు. జబ్బు రావడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాంభూపాల్ విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే ములకలపెంట గ్రామానికి ప్రత్యేక వైద్య సిబ్బందిని పంపాలన్నారు. గ్రామస్తులకు యుద్ధప్రాతిపదికన వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. జనరల్, బయోక్రిటిక్, ఎస్‌పిఎం శాఖలు, మెడికల్ కాలేజ్ విద్యార్థులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. గ్రామస్తులకు అన్ని రకాల వైద్య పరీక్షలను నిర్వహించాలన్నారు. ఒకే గ్రామంలో ఇంతమంది కిడ్నీ సమస్యలకు ఎందుకు గురవుతున్నారన్న విషయాన్ని తెలుసుకోవాలన్నారు. ఒకే రోగంతో ఇంతమంది బాధితులుగా ఉండడం అసాధారణ విషయమన్నారు. ముందుముందు మరింత మంది ఈ జబ్బుకు బలికాకముందే తక్షణ వైద్యం అందించాలన్నారు. ఇక గ్రామానికి కిలోమీటర్ దూరంలో మైనింగ్ జరుగుతోందని, ఇది కూడా ఏమైనా కారణమా.? అన్న విషయాలపై అధ్యయనం చేయాలన్నారు. భూగర్భ జలాలను సేకరించి వాటిని కూడా పరీక్షించాలన్నారు. ఇప్పటికే కిడ్నీ వ్యాధితో మంచాన పడ్డ వారి కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుని వారి కుటుంబాలకు అవసరమైన జీతభత్యాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. డయాలసిస్ చేయించుకోవడానికి సుదూర ప్రాంతాలకు వెళ్తున్న బాధితులకు ప్రయాణ ఖర్చులు, అదునపు మందుల ఖర్చులకు అయ్యే డబ్బును ప్రభుత్వమే ఇవ్వాలన్నారు. స్థానిక ఎమ్మెల్యే కూడా ఈ విషయంపై స్పందించి బాధితులకు ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందించేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు దాసరి శ్రీనివాసులు, బజంతరి శ్రీనివాసులు, నాగరాజు, కసాపురం రమేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సమస్యలపై 'ఆశా'ల ఆందోళన

◆ కలెక్టరేట్ వద్ద ధర్నా ◆ భారీగా తరలొచ్చిన ఆశా కార్యకర్తలు ◆ సిఐటియు ప్రజాసంఘాల మద్దతు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

అపరిష్కృతంగా ఉన్న ఆశాల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆశా వర్కర్స్ యూనియన్, సిఐటియు సంయుక్త ఆధ్వర్యంలో అనంతపురం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అంతకుమునుపు గుత్తి రోడ్డు సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ గేటు ఎదుట బైటాయించి నిరసన తెలిపారు. ఆశా వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు మాలతి అధ్యక్షతన నిర్వహించిన ధర్నా కార్యక్రమానికి కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి బాల రంగయ్య హాజరై మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆశా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగమణి మాట్లాడుతూ ఆశాల పట్ల వైద్యశాఖ సిబ్బంది వేధింపులకు పాల్పడుతున్నారని చెప్పారు. ఎంఎల్‌హెచ్‌పిలు, సచివాలయం ఎఎన్‌ఎంలు అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. తమ పరిధిలో ఉండాలంటే తమ పరిధిలో ఉండాలని ఎంఎల్‌హెచ్‌పిలు, సచివాలయ సిబ్బంది ఆశాలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని చెప్పారు. ఆశలకు సంబంధం లేని పనులను పిహెచ్‌సిలు, సబ్ సెంటర్లలో చేయిస్తున్నారని చెప్పారు. ఇన్ని పనులు చేస్తున్నా వారి సమస్యల పరిష్కారంలో మాత్రం ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తోందన్నారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా అన్ని సెలవులూ వర్తింపజేయాలని కోరారు. అధికారులు, రాజకీయ నాయకుల వేధింపులను నియంత్రించాలని కోరారు. కౌలు రైతుసంఘం జిల్లా కార్యదర్శి బాలరంగయ్య మాట్లాడుతూ గ్రామాల్లో ఆశా కార్యకర్తలకు ప్రజలకు వివిధ రకాల సేవలు అందిస్తున్నారని చెప్పారు. ఇంతటి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న వారికి ప్రభుత్వం కనీస వేతనాలు అమలు చేయకపోవడం దుర్మార్గం అన్నారు. ఆశాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేయడం లేదన్నారు. వేతనాలు అరకొరగా ఇస్తూ, పథకాల్లో కోతలు పెట్టడం సరికాదన్నారు. ప్రభుత్వ పథకాలు వర్తింపజేయనందున వారికి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రామాంజినేయులు, నగర కార్యదర్శి వెంకటనారాయణ మాట్లాడుతూ ఆశాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. ఒంటరి మహిళలు వితంతువులకు వస్తున్న పెన్షన్‌లను ఆశాలకు ఇవ్వాలన్నారు. అనారోగ్యంతో మృతి చెందే ఆశాలకు గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలన్నారు. ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు మాలతి మాట్లాడుతూ ఆశలందరికీ స్మార్ట్ ఫోన్లు ఇచ్చారని, అందులో 10 శాతం ఫోన్లు కూడా పని చేయడం లేదన్నారు. నాణ్యమైన సెల్ ఫోన్‌లు ఇచ్చి 4జి సిమ్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్ అధికారులకు సమస్యలతో కూడిన వినిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎండిఎం జిల్లా అధ్యక్షులు జయమ్మ, ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు వరలక్ష్మి, భారతి, జరీనా, మల్లిక, నాగమణి, ప్రేమ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌కు ర్యాలీగా వస్తున్న ఆశా కార్యకర్తలు

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

మున్సిపల్ కార్మికుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, మున్సిపల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.నాగభూషణ, సిపిఎం నగర ప్రధాన కార్యదర్శి వి.రామిరెడ్డి డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ చనిపోయిన కార్మికులకు డెత్ బెనిఫిట్స్, ఇఎస్ఐ, ఇపిఎఫ్ మెడ్జ్, పనిముట్లు, పరకలు, గంపలు, కలువ కడ్డీలు, పుష్‌కార్ట్ తదితరాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యలు పరిష్కరించాలని మూడు నెలల క్రితం కార్మికులు ఆందోళన చేయగా అధికారులు, పాలకవర్గం, సిఐటియు, మున్సిపల్ యూనియన్ నాయకత్వంతో చర్చలు జరిగి మూడు నెలల్లో సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. అయితే నేటికీ పరిష్కరించిన పాపానపోలేదన్నారు. ఈనేపథ్యంలో కార్మికులు రోడ్లు ఊడ్చాలంటే సొంత డబ్బులు వెచ్చించి పరకలు కొనుక్కోవాల్సి వస్తోందన్నారు. అదేవిధంగా కోవిడ్, మలేరియా, క్లాప్ ఆటో డ్రైవర్లు, గార్బేజ్ కార్మికులకు మూడు నెలల వేతనాలు ఇవ్వాలన్నారు. ఆయా సమస్యలను పరిష్కరించాలని ఇన్‌ఛార్జి కమిషనర్ రమణారెడ్డి, హెల్తాఫీసర్ గంగాధర్‌రెడ్డికి వినతిపత్రం సమరించారు. ఇందుకు అధికారులు స్పందిస్తూ ఉన్నతాధికారులతో మాట్లాడి 15రోజుల్లోపు సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు నల్లప్ప, భగత్ సింగ్ ఆటో డ్రైవర్స్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌టిఆర్ శ్రీనివాసులు, సిఐటియు నగర అధ్యక్షులు గురురాజ, మున్సిపల్ యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి సాకె తిరుమలేష్, ట్రెజరర్ లక్ష్మీనరసమ్మ, ఉపాధ్యక్షులు శేషంద్రకుమార్, రాఘవ, ప్రభాకర్, శివ, ముత్యాలమ్మ, రాజమ్మ, మరియమ్మ, శ్రీనివాసమూర్తి, 200 కార్మికులు పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జి కమిషనర్ రమణారెడ్డి, హెల్తాఫీసర్ గంగాధర్‌రెడ్డితో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలి

ప్రజాశక్తి-గుత్తి

పెంచిన విద్యుత్ ఛార్జీలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ టిడిపి ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని ఎపిఎస్‌పిడిసిఎల్ ఇఇ కార్యాలయ ప్రధాన గేటు ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి మండల, పట్టణ కన్వీనర్లు బర్దివలి, రవిశంకర్‌గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలపై ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలను పెంచి పేదలపూ రూ.57 వేల కోట్ల భారం వేసిందన్నారు. జగన్ ప్రభుత్వం పోయి.. టిడిపి ప్రభుత్వం వస్తేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. జగన్ పాలనలో ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించేంత వరకు పోరాటాలు కొనసాగిస్తామన్నారు. అనంతరం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాజశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి భరత్, ఎంపిటిసి ధనుంజయ, టౌన్‌బ్యాంకు అధ్యక్ష, ఉపాధ్యక్షులు జిలాన్, కృష్ణ, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి దిల్కా శీనా, టౌన్ క్లస్టర్ ఇన్‌ఛార్జి శ్రీకాంత్ చౌదరి, మాజీ ఎంపిపి వీరభద్రయ్య, మాజీ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ శ్రీనివాసయాదవ్, నాయకులు సుధాకర్‌నాయుడు, కె.గోవిందు, ఎస్ఎం.బాషా, నాగరాజు, ఎ.పులికొండ, తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న టిడిపి నాయకులు

తాగునీటి పైప్‌లైన్ల లీకేజీలపై ప్రత్యేక దృష్టి

మేయర్ మొహమ్మద్ వసీం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగరంలో తాగునీటి పైప్‌లైన్ల లీకేజీలపై ప్రత్యేక దృష్టి సారించాలని మేయర్ మొహమ్మద్ వసీం సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం నగరంలోని పాతూరు ట్యాంకు వద్ద తాగునీటి సరఫరా పైప్‌లైన్ లీకేజీ మరమతు పనులను మేయర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల తరచుగా పైప్‌లైన్ లీకేజీ సమస్యలు వస్తున్నాయన్నారు. ముందస్తు చర్యలు చేపట్టి లీకేజీ సమస్యలు రాకుండా చూడాలని ఆదేశించారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని పైప్‌లైన్ లీకేజీ వల్ల నీటి సరఫరా కానీ ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని సూచించారు. మేయర్ వెంట కార్పొరేటర్లు లక్ష్మీదేవి, అనిల్‌కుమార్‌రెడ్డి, ఎఇ సాయినాథ్, ట్యాప్ ఇన్స్‌పెక్టర్ మహబూబ్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతులను పరిశీలిస్తున్న మేయర్ మొహమ్మద్ వసీం

నారాయణ విద్యాసంస్థలను సీజ్ చేయాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బంగి శివ

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలో ప్రభుత్వ అనుమతి లేకుండా నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న నారాయణ విద్యాసంస్థలను సీజ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బంగి శివ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2022-23 విద్యా సంవత్సరం ముగియకుండానే నారాయణ విద్యాసంస్థల యాజమాన్యం రాయదుర్గం ప్రాంతంలో ముందస్తు అడ్మిషన్లు చేసుకునేందుకు ప్రచారం నిర్వహిస్తోందన్నారు. ముందస్తు ప్రచారం నిర్వహిస్తున్నా విద్యాశాఖ అధికారులు పట్టీపట్టినట్లు వ్యవహరించడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా రాయదుర్గం విద్యాశాఖ అధికారులు స్పందించి ముందస్తు అడ్మిషన్లకు ప్రచారం నిర్వహిస్తున్న నారాయణ విద్యాసంస్థల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బంగి శివ

రంజాన్ తోఫా పంపిణీ

ప్రజాశక్తి-తాడిపత్రి

పట్టణంలోని నిరుపేద కుటుంబాలకు పట్టణానికి చెందిన ముస్లిం మైనారిటీ నాయకుడు కలైగర్ మొహమ్మద్ ఆయూబ్ మంగళవారం రంజాన్ తోఫా పంపిణీ చేశారు. ఆల్లా రఖా వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో సుమారు 250 నిరుపేద కుటుంబాలకు రంజాన్ తోఫా పంపిణీ అందజేశారు. ఈ కార్యక్రమంలో జుమ్మా, రోజా మసీదుల హఫిసాబ్‌లు సుల్తాన్ మొహిద్దీన్, ఆరీఫ్ సాహెబ్, చాంద్‌బాషా సాహెబ్, కమిటీ సభ్యులు ఆయూబ్‌బాషా, నజీర్ బాషా, ఎంఎస్ బాషా, ఖాజా, షాకీర్, తదితరులు పాల్గొన్నారు.

రంజాన్‌తోఫా పంపిణీ చేస్తున్న ముస్లిం మైనారిటీ నాయకుడు కలైగర్ మొహమ్మద్ ఆయూబ్

ఎమ్మెల్సీ శివరామిరెడ్డికి కృతజ్ఞతలు

ప్రజాశక్తి-ఉరవకొండ

విడపనకల్లు మండల పరిధిలోని గడేకల్ గ్రామంలో నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరు చేయించడం పట్ల ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డికి వైసిపి నాయకులు పంపాపతి ఆధ్వర్యంలో మంగళవారం కృతజ్ఞతలు తెలిపారు. విద్యుత్ సబ్‌స్టేషన్ లేక గ్రామంలో కొన్నేళ్లుగా విద్యుత్ సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడేవారన్నారు. సమస్యను ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన సంబంధిత ఉన్నతాధికారులతో మాట్లాడి సబ్‌స్టేషన్ మంజూరు చేయించారన్నారు. దీంతో గడేకల్‌తో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

19 నుంచి జిల్లాస్థాయి క్రికెట్ టోర్నీ

గుత్తి : మండలంలోని ఉబిచెర్ల గ్రామంలో ఈనెల 19వ తేదీ నుంచి జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు లక్కిరెడ్డి శేఖర్, లక్ష్మీరెడ్డి, హసన్‌బాషా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలో కాశీ విశ్వనాథ్ శివుడి విగ్రహ ప్రతిష్టాపనను పురస్కరించుకుని క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టోర్నీ విజేతకు మొదటి బహుమతి రూ.30,116, ద్వితీయ బహుమతి రూ.20,116 అందజేయనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు సెల్..89196 63064 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

వాటర్‌ప్లాంట్లు ప్రారంభం

శింగనమల : మండల పరిధిలోని కొరివిపల్లి, పోతురాజుకాలవ గ్రామాల్లో ఆలూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్లను ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దాదాపు రూ.7లక్షలు ఖర్చు చేసి ఈ గ్రామాల్లో మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని రెండు మండలాల్లో కేవలం వాటర్‌ప్లాంట్ల నిర్మాణానికే ఆలూరు ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.14 లక్షలు ఖర్చు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో ప్రెసిడెంట్ బొమ్మన శ్రీరామిరెడ్డి, యువ నాయకుడు ఆలూరు ఎర్రిస్వామిరెడ్డి, ఎంపిపి యోగేశ్వరి, వైసిపి మండల కన్వీనర్ పట్నం నగేష్, ముచ్చుకోట శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

జెఎన్‌టియులో డ్రెస్‌కోడ్ అమలు : విసి

అనంతపురం : అనంతపురం జెఎన్‌టియు పరిధిలో పని చేసే స్వీపర్లు, వాచ్‌మెన్‌లకు మంగళవారం నుంచి డ్రెస్ కోడ్ అమలు చేస్తున్నట్లు ఉపకులపతి జి.రంగజనార్ధన తెలిపారు. ఇందులో భాగంగా మంగళవారం స్థానిక పరిపాలన భవనంలో వాచ్‌మెన్లు, స్వీపర్లకు డ్రెస్సులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాచ్‌మెన్లు, స్వీపర్లు రోజూ తప్పనిసరిగా డ్రెస్సు వేసుకుని రావాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఎం.విజయకుమార్, రిజిస్ట్రార్ సి.శశిధర్, పీఆర్ఓ ఎం.రామశేఖర్‌రెడ్డి, యూనివర్సిటీ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రవికుమార్, యూనివర్సిటీ ఇంజినీర్ ఎండి అస్లాం, సిబ్బంది పాల్గొన్నారు.

స్వీపర్లు, వాచ్‌మెన్లతో ఉపకులపతి జి.రంగజనార్ధన, వర్శిటీ అధికారులు

పోరాటాల ఊపిరి ఎఐకెఎస్

ఘనంగా ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-పుట్లూరు

రైతు సమస్యలపై పోరాటాలకు అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) పుట్టినిల్లు లాంటిదని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వి.టి.రామాంజినేయులు, రైతుసంఘం మండల కార్యదర్శి జి.వెంకటచౌదరి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.సూర్యనారాయణ కొనియాడారు. ఎఐకెఎస్ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా మంగళవారం మండలంలోని కడవకల్లు గ్రామంలో జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు ఉద్యమ అమరవీరుల త్యాగాల స్ఫూర్తితో రైతాంగ సమస్యలపై ఉద్యమాలు చేస్తామన్నారు. 1936 ఏప్రిల్ 11న ఏర్పడిన అఖిల భారత కిసాన్ సభ నాటి నేటి వరకూ అనేక ఉద్యమాలు చేసిందని గుర్తు చేశారు. ముఖ్యంగా మూడు వ్యవసాయ నల్లచట్టాలకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో కీలకపాత్ర వహించిందని వివరించారు. ఆనాటి జమిందారీ విధానానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా పెద్దఎత్తున ఉద్యమాలు నిర్వహించిందన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం, పశ్చిమబెంగాల్‌లో తేభాగ పోరాటం, కేరళలో పున్న ప్రవాయిలార్ పోరాటం, మహారాష్ట్రలో వర్లీ ఆదివాసీ పోరాటం, జిల్లావ్యాప్తంగా రైతు రక్షణకై పాదయాత్ర వంటి చారిత్రాత్మక ఉద్యమాలకు నాయకత్వం వహించినట్లు వివరించారు. అయితే అన్నదాతలు అప్పులఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈపరిస్థితుల్లో మద్దతు ధర గ్యారెంటీ చట్టం, రైతు రుణ విమోచన చట్టం సాధన కోసం రైతాంగం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు టి.పెద్దయ్య, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల నాయకులు నాగభూషణం, రైతులు రామచంద్ర, శ్రీరాములు, సూర్యనారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జెండాను ఆవిష్కరిస్తున్న ఎఐకెఎస్ నాయకులు

శాశ్వత ఉద్యోగులుగా గుర్తించండి..

ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎటిఎం నాగరాజు

ప్రజాశక్తి-గుత్తి

మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలని సిఐటియు అనుబంధ సంస్థ ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎటిఎం నాగరాజు డిమాండ్ చేశారు. ఈమేరకు మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. సకాలంలో పనిముట్లను అందజేయాలన్నారు. ఈపీఎఫ్, ఈఎస్ఐ, హెల్త్ కార్డులు అమలు చేయాలన్నారు. మున్సిపల్ విస్తీర్ణం, ప్రజలకు తగ్గ కార్మికుల సంఖ్యను పెంచాలన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన నవరత్న పథకాలను మున్సిపల్ కార్మికులకు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాసులుకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కాంట్రాక్టు పారిశుధ్య కార్మికుల సంఘం నాయకులు కె.మహేష్, ఎన్.రామాంజనేయులు, బి.నాగేంద్ర, సూరి తదితరులు పాల్గొన్నారు.

ఆందోళనలో మాట్లాడుతున్న యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎటిఎం నాగరాజు

ప్రతి పొలంలో మట్టి నమూనాల సేకరణ

జిల్లా వ్యవసాయ అధికారి బి.చంద్రానాయక్

ప్రజాశక్తి-అనంతపురం

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు మేరకు 2023-24 సంవత్సరానికి రైతు భరోసా కేంద్రాల పరిధిలోని ప్రతి పొలంలో మట్టి నమూనాలను సేకరించాలని జిల్లా వ్యవసాయ అధికారి బి.చంద్రానాయక్ తెలిపారు. మంగళవారం స్థానిక నారాయణపురం రైతుభరోసా కేంద్రంలో జిల్లాలోని ఆరు వ్యవసాయ డివిజన్ పరిధిలో ఉన్న మండల వ్యవసాయ అధికారులు, రైతు భరోసా కేంద్రం అగ్రికల్చర్ అసిస్టెంట్లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా, మండల స్థాయిలో ఈనెల 10 నుంచి 16వ తేదీ వరకు మట్టి నమూనాలు సేకరించడంలో శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. ఇందులో భాగంగా జిల్లాలోని ఆరు వ్యవసాయ సబ్ డివిజన్లలో ఉన్న సహాయ వ్యవసాయ సంచాలకులు, మండల వ్యవసాయ అధికారులు, రైతు భరోసా కేంద్రాల ఇన్‌ఛార్జిలకు మట్టి నమూనాల సేకరణ, నేల సారవంతంపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కావున వ్యవసాయ శాఖ సిబ్బంది చాలా జాగ్రత్తగా శిక్షణ తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భూసార పరీక్ష కేంద్రం ఎడిఎ రోజా పుష్పలత, శైలజాకుమారి, కెవికె రెడ్డిపల్లి శాస్త్రవేత్త డాక్టర్ శశికళ, డివిజన్ ఎడిఎలు వెంకట్రాముడు, యల్లప్ప, పద్మజా, లక్ష్మానాయక్, మండల వ్యవసాయ అధికారులు ఆర్‌బికె ఇన్‌ఛార్జిలు పాల్గొన్నారు.

మట్టి నమూనాలు తీసే విధానంపై అవగాహన కల్పిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి బి.చంద్రానాయక్

'మా నమ్మకం నువ్వే జగన్'కు విశేష స్పందన

ప్రజాశక్తి-ఉరవకొండ

విడపనకల్ మండలం గడేకల్ గ్రామంలో మంగళవారం నిర్వహించిన మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించిందని ఎంపిపి కరణం పుష్పవతి భీమ్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు విడపనకల్లు ఎంపిపి ఆధ్వర్యంలో ఎస్సీ కాలనీలో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వం పథకాలపై ఆరాతీశారు. అనంతరం ఇళ్లకు స్టిక్కర్లు అతికించారు. ప్రజల నుంచి వస్తున్న స్పందన చూస్తే 2024లో కూడా మరోసారి జగన్ సిఎం కావడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గడేకల్ సర్పంచి సుశీలా ఉమాశంకర్, విడపనకల్ మండల వైసిపి నాయకులు కరణం భీమిరెడ్డి, ఎంపిటిసి ఓబులేష్, నాయకులు హంపయ్య, ఎర్రన్న, చిన్న తిమ్మన్న, మాధవరెడ్డి, సచివాలయ కన్వీనర్లు ఉమాశంకర్, ప్రసాద్, ప్రతాప్, గృహసారథులు లాలెప్ప, మహేష్, మనోహర్, కృష్ణవేణి, నీలావతి, జయమ్మ, మారెప్ప, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు విడుదల చేస్తున్న వైసిపి నాయకులు

వడదెబ్బపై అవగాహన

ప్రజాశక్తి-ఉరవకొండ

మండల పరిధిలోని రాకెట్ల ప్రభుత్వ ఆరోగ్య ఉపకేంద్రలో వేసవికాలంలో తగిలే వడదెబ్బపై వైద్యాధికారిణి పావని, హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్ఎండి షఫీ మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉష్ణోగ్రతలు బాగా పెరుగుతుండటంతో ఆరుబయట ఆటలు ఆడేవారికి, ఎండలో పనులు చేసేవారికి వడదెబ్బ తగిలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. కావున ప్రజలు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎండల్లో తిరగకుండా ఉండాలన్నారు. ఒకవేళ బయటకు వెళ్లాల్సి వస్తే చెప్పులు, తలకు టోపీ, రుమాలు ధరించాలని, గొడుగు తీసుకుని వెళ్లాలన్నారు. అలాగే తలనొప్పి, తల తిరగడం, అధిక జ్వరం, నీరసం, నాలుక ఎండిపోవడం, మగతగా ఉండడం, స్పృహ కోల్పోవడం వంటివి వడదెబ్బ లక్షణాలు అన్నారు. ఈ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని కోరారు. ఓఆర్ఎస్ ద్రావణం, కొబ్బరి నీరు, మజ్జిగ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఎచ్‌పి, సిహెచ్ఓలు భవాని, భారతి, సచివాలయ ఎఎన్ఎం చాముండేశ్వరి, హెల్త్ అసిస్టెంట్ ముకుందర్, సిఒ భగవాన్, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బపై అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

ఆర్ట్ మ్యూజియం ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-గుత్తి

మండల కేంద్రంలో ఆర్ట్ మ్యూజియం ఏర్పాటు చేయాలని గుత్తి కోట సంరక్షణ సమితి ప్రధాన కార్యదర్శి వై.రాజశేఖర్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడు పి.వెంకటరామిరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని రజాపురం గ్రామంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ గుత్తిలోని మన్రోసత్రాన్ని అభివృద్ధి చేసి ఆర్ట్ మ్యూజియంగా ఏర్పాటు చేయాలన్నారు. ఎక్కడెక్కడో లభించిన శిల్పాలు, పురాతన శాసనాలు భద్రపరిచి బావితరాలకు ఇవ్వాలన్నారు. అలాగే పెద్దవడుగురు, ప్యాపిలి, జొన్నగిరి వద్ద ఇప్పటికీ పంట పొలాల్లో పట్టించుకోకుండా వదిలేసిన పురాతన శిల్పాలు, గుత్తి కోట ప్రాగణంలో ఎన్నో పురాతన శిల్పాలను పట్టించుకోకపోవడంతో కాలగర్భంలో కలిసిపోతున్నాయన్నారు. వాటన్నిటినీ సేకరించి ఆర్ట్ మ్యూజియంలో భద్రపరచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గుత్తి కోట సంరక్షణ సమితి నాయకులు కోట గైడ్ రమేష్, ఉపాధ్యక్షుడు కాశీరావు, మహాలింగ, హాజీ మలన్ బాబా, సీతారాంరెడ్డి, కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న గుత్తి కోట సంరక్షణ సమితి నాయకులు

నేరాలు ఘోరాలు

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

బొమ్మనహాల్ : మండలంలోని ఉంతకట్లు గ్రామానికి చెందిన రజాక్‌బాషా (45) సమీపంలోని హిందూ శ్మశాన వాటిక వద్ద చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. జమేదార్ హనుమాన్‌నాయక్ తెలిపిన వివరాల మేరకు.. రజాక్‌బాషా మద్యానికి బానిసయ్యాడు. దీంతో తరచూ భార్యతో గొడవపడేవాడు. ఇందులో భాగంగానే సోమవారం రాత్రి భార్యాభర్తలు వాదులాడుకున్నారు. దీంతో మనస్థాపానికి గురైన రజాక్‌బాషా సమీపంలోని శ్మశాన వాటిక వద్దకు వెళ్లి లుంగీతో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం గమనించిన స్థానికులు బంధువులకు తెలియజేశారు. దీంతో పోలీసులకు సమాచారం అందజేశారు. వెంటనే పోలీసులు వచ్చి పరిస్థితిని సమీక్షించారు. తర్వాత మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు జమేదార్ తెలిపారు.

ఉరేసుకున్న రజాక్‌బాషా

రేషన్ బియ్యం పట్టివేత

గుత్తి : మండలంలోని పెద్దొడ్డి గ్రామంలో మంగళవారం అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. గ్రామానికి చెందిన తపిల చిరంజీవి పలు ప్రాంతాల్లో తక్కువ ధరకే రేషన్ బియ్యాన్ని సేకరించి బ్లాక్ మార్కెట్‌లో విక్రయించడానికి తన ఇంటి వద్ద బియ్యాన్ని ఐచర్‌లో 70 క్వింటాళ్ల బియ్యాన్ని కర్ణాటక రాష్ట్రం బంగారు పేటకు తరలిస్తుండగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ జి.వీరరాఘవరెడ్డి ఆధ్వర్యంలో దాడి చేసి పట్టుకున్నారు. వాహనం, బియ్యాన్ని స్వాధీనం చేసుకుని రెవెన్యూ అధికారులకు అప్పగించారు. తపిల చిరంజీవి, ముదిగుబ్బ మండలం ఆర్ఎస్ తండాకు చెందిన బి.గిరిబాబు, వాహనం డ్రైవర్ గోపాల్‌నాయక్, ధర్మవరం చెందిన క్లీనర్ రమేష్‌ను అరెస్టు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈకార్యక్రమంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎఒ వాసుప్రకాష్, ఎస్ఐలు పి.శేషగిరి, జి.జైపాల్‌రెడ్డి, సిఎస్‌డిటి కంబక్క, తదితరులు పాల్గొన్నారు.

గుత్తిలో రేషన్ బియ్యాన్ని పట్టుకున్న అధికారులు

బెలుగుప్ప: మండల పరిధిలోని గుండ్లపల్లి గ్రామం సమీపంలో దాడి చేసి రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్ఐ రామకృష్ణయ్య తెలిపారు. పక్కాగా అందిన సమాచారం మేరకు మంగళవారం ఆటోలో రేషన్ బియ్యం బస్తాలను తరలిస్తుండగా సిబ్బందితో వెళ్లి దాడి చేసి బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే శెట్టూరు మండలం మాల్యనాయకనహళ్లి గ్రామానికి చెందిన కురుబ ఆంజనేయులు ఆటోను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. బియ్యాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గుత్తి : మండలంలోని అనగానిదొడ్డి గ్రామ సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. గ్రామానికి చెందిన నరేంద్ర ద్విచక్ర వాహనంలో గుత్తికి వస్తుండగా వాహనం అదుపుతప్పి కిందపడ్డాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ అతన్ని చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రి తరలించారు.

వాహనాల పట్టివేత

యాడికి : పరిమితికి మించి లోడుతో రెండు డోలమైట్ ట్రాక్టర్లు, రా మెటల్‌తో వెళ్తున్న మరో రెండు టిప్పర్లను అనంతపురం రీజినల్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ ఆధ్వర్యంలో పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు. సంబంధిత అధికారుల నుంచి విడుదల పత్రాలు తెచ్చుకుని వాహనాలు తీసుకెళ్లాలని కోరారు.

సెలూన్ షాపులో అగ్నిప్రమాదం

సెలూన్ షాపులో నుంచి పొగలు వస్తున్న దృశ్యం

రాయదుర్గం : పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి వెనుక ఉన్న బార్బర్ షాప్‌లో మంగళవారం సాయంత్రం అగ్నిప్రమాదం జరిగింది. షార్ట్ సర్క్యూట్ వల్ల షాప్‌లో మంటలు అంటుకుని కాలిపోయింది. గమనించిన స్థానికులు అగ్నిమాపక దళం వచ్చి మంటలను ఆర్పి వేసింది.

ఎఎస్ఐ లూకయ్య మృతి

గుత్తి : గుత్తిలో ఎఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న లూకయ్య(58) మంగళవారం తెల్లవారుజామున మృతిచెందాడు. నాలుగేళ్లుగా గుత్తిలో ఎఎస్ఐ గా పనిచేస్తున్న ఆయన గతనెల 24న అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో అనంతపురంలోని కిమ్స్ సవీరా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందినట్లు స్థానిక పోలీసులు తెలిపారు. ఆయన మృతి పట్ల పోలీస్ అధికారులు, సిబ్బందితో పాటు పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

న్యాయసేవ సలహాదారుల నియామకం

గుత్తి : ఏపీ రాష్ట్ర న్యాయ సాధికారత సంస్థ ఆదేశాలతో మండల న్యాయ సేవా సమితి ద్వారా న్యాయసేవ సలహాదారులను నియమించారు. ఇమినేంట్ పర్సన్ ఇన్ ది ఫీల్డ్ ఆఫ్ లాగా న్యాయవాది విసి.గంగాధర్‌కుమార్, సోషల్ వర్కర్‌గా చైల్డ్ లైన్ 1098 కోఆర్డినేటర్ బాలాజీ, ఇంప్లిమెంటేషన్ ఆఫ్ లీగల్ సర్వీసెస్ స్కీమ్స్‌గా న్యాయవాది జాకీర్ హుస్సేన్‌ను నియమించారు. ఈమేరకు మంగళవారం వారికి గుత్తి 6వ అదనపు జిల్లా న్యాయమూర్తి, మండల న్యాయ సేవా సమితి అధ్యక్షులు జి.కబర్ది నియామక పత్రాలను అందజేశారు.

నియామక పత్రం అందుకుంటున్న న్యాయవాది

అనంతలో ఇఫ్తార్ విందు

అనంతపురం : పేదల ఆకలి తీర్చేందుకేబాధ కూడా ప్రతి ఒక్కరికీ తెలియాలని అల్లా చూపిన పవిత్ర మార్గంలో పయనించి ఆకలి లేని ప్రపంచాన్ని స్థాపించాలన్నదే రంజాన్ మాసంలో పాటించే కఠోర ఉపవాస దీక్షలకు పరమాత్మం అని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. నగరంలోని 2వ రోడ్డు గల బావుద్దీన్ మసీదు వద్ద వైసీపీ యువ నాయకులు ఆసిఫ్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నగరంలో కులమతాలకతీతంగా హిందూ, ముస్లిములు రంజాన్ పండుగను జరుపుకోవడం మతసామరస్యానికి ప్రతీక అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నగర అధ్యక్షులు చింతా సోమశేఖరరెడ్డి, రాష్ట్ర ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ శ్యామల అనిల్‌కుమార్‌గౌడ్, అమర్‌నాథరెడ్డి, షేర్ అలీఖాన్, వైసిపి మహిళలు సుజాతారెడ్డి, భారతి, అబ్దుల్లా, నవాజ్, వసీం, శాషు, ఇద్రీష్, దాదు, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

పూలే ఆశయాలను సాధిద్దాం..

జయంతి కార్యక్రమాల్లో నాయకులు

నగరంలో జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు జిల్లాలోని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రం జిల్లా పరిషత్ కార్యాలయం ఆవరణంలో ఉన్న పూలే విగ్రహానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజా సంఘాల నేతలు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. పూలే ఆశయాలు కొనసాగించడమే మనందరి కర్తవ్యంగా పని చేయాలని వారు పిలుపునిచ్చారు.

యుటిఎఫ్, కెవిపిఎస్ ఆధ్వర్యంలో

యుటిఎఫ్ ఆధ్వర్యంలో పూలే విగ్రహానికి నాయకులు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు లింగమయ్య, కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లప్ప హాజరై మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ఆడిట్ కన్వీనర్ సుబ్బరాయుడు, నగర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు రాప్తాడు మండల ప్రధాన కార్యదర్శి నాయుడు, అనంతపురం రూరల్ దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సిఐటియు ఆధ్వర్యంలో..

సిఐటియు ఆధ్వర్యంలో పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. పూలే విగ్రహానికి నాయకులు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, మున్సిపల్ కార్మికుల యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో..

జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యాలయం ఆవరణంలో పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. పూలే చిత్రపటానికి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.రమ, సిబ్బంది పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.

టిడిపి ఆధ్వర్యంలో..

తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా పరిషత్ కార్యాలయం ఆవరణంలో పూలే విగ్రహానికి నాయకులు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షుడు కాలువ శ్రీనివాసులు, టిడిపి నగర అధ్యక్షుడు మారుతి కుమార్ గౌడ్, రాష్ట్ర కార్యదర్శులు ఆదినారాయణ, దేవర్ల మురళి, జిల్లా అధికార ప్రతినిధులు సరిపూటీ రమణ, నారయణ స్వామి యాదవ్, టిడిపి నగర మహిళా అధ్యక్షురాలు విజయశ్రీ రెడ్డి, స్వప్న, సంఘ తేజస్విని, రమాదేవి, సుధాకర్ యాదవ్, సిమెంటు పోలన్న, షణ్ముఖ, కూచి హరి తదితరులు పాల్గొన్నారు.

బిసి ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..

బిసి ఉద్యోగుల సంక్షేమ సంఘం, బిసి సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో పూలే జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిసి ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింత చంద్రమోహన్, బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు చక్రధర్ యాదవ్, బిసి ఉద్యోగుల సంఘం నాయకులు మోతిలాల్, అనంత సేన, న్యాయవాది మూర్తి, వెంకటస్వామి, రమేష్, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం : మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకుని మంగళవారం నగరంలోని జెఎన్‌టియు పరిపాలన భవనంలో ఉపకులపతి జి.రంగజనార్ధన ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా విసి మాట్లాడుతూ జ్యోతిరావు పూలే గొప్ప సాంఘిక విప్లవకారుడు అని కొనియాడారు. నిస్సహాయకులుగా మిగిలిన సామజిక వర్గాల కోసం జీవితాంతం పోరాడిన త్యాగశీలి అన్నారు. అంతేగాకుండా దేశంలో సమానత్వం, గ్రామీన ప్రాంతాల మహిళల విద్యాభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ ఆయన అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఎం.విజయకుమార్, రిజిస్ట్రార్ సి.శశిధర్, యూనివర్శిటీ అధికారులు భానుమూర్తి, సుమలత, ఇ.కేశవరెడ్డి, శోభాబిందు, కిరణ్మయి, చంద్రమోహన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఆర్.భవాని, కళ్యాణ్‌కుమార్, దిలీప్‌కుమార్, ఎం.రామశేఖర్‌రెడ్డి, డిప్యూటీ రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

అలాగే ఎస్‌కెయులో పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో విసి రామకృష్ణారెడ్డి, డాక్టర్ రమేష్‌నారాయణ, సైన్స్ ఆర్ట్స్ బీఈడీ ఫార్మసీ, ఇంజినీరింగ్ కళాశాలల ప్రిన్సిపాళ్లు బాలసుబ్రమణ్యం, కృష్ణకుమారి, సదాశివరెడ్డి, రామచంద్ర, సోమశేఖర్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి జిల్లా కార్యాలయంలో...

మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకుని జిల్లాకేంద్రంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య, ఎడిసిసిబి ఛైర్‌పర్సన్ లిఖిత, మాజీ ఛైర్మన్ వీరాంజినేయులు, జడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ వెన్నెపూస రవీంద్రారెడ్డి, నాటక అకాడమీ ఛైర్‌పర్సన్ రాగి హరిత, రజక కార్పొరేషన్ ఛైర్మన్ మీసాల రంగన్న, ఎపిఎస్, ఆర్టీసీ జోనల్ ఛైర్‌పర్సన్ మంజుల, బీసీ కమిషన్ సభ్యులు క్రిష్టప్ప, బీసీ అధ్యయన కమిటీ సభ్యులు ధనుంజయ్‌యాదవ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగే పరుశురాం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వాసంతిసాహిత్య, తదితరులు పాల్గొన్నారు.

అలాగే ఎపిఎస్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ కార్యాలయంలో పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ కడప జోన్ ఛైర్‌పర్సన్ మంజుల ఓబులేసు, ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సుమంత్ ఆర్.ఆథోని, డిప్యుటీ సిఎంఇ మోహన్‌కుమార్, రీజినల్ మేనేజర్ కార్యాలయంలోని ఉద్యోగులు, బిసి నాయకులు, ఎన్ఎంయు, ఇయు అసోసియేషన్ల నాయకులు పాల్గొన్నారు.

ఉరవకొండ : సమ సమాజ స్థాపనలో భావితరాలకు నిత్య స్ఫూర్తి ప్రదాతగా నిలిచిన మహాత్మ జ్యోతిరావు పూలేను నేటితరం ఆదర్శంగా తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. సామాజిక విప్లవకారులు మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి లలిత, ఎంపిపి చంద్రమ్మ, కురుబ, ఎంబిసి కార్పొరేషన్ల కొడికి గోవిందు, జోగి వెంకటేష్, టౌన్‌బ్యాంక్ అధ్యక్షుడు సాధు కుళ్లాయిస్వామి, వార్డు సభ్యుడు వాసు, ఇఒ గౌస్, నాయకులు బసవరాజు, ఏసీ ఎర్రిస్వామి, చంగల మహేష్, ఓబన్న, మీనుగా ఎర్రిస్వామి, బ్యాళ్ల ప్రసాద్, కురుబ ప్రకాష్, అన్వర్, రఫీక్, అమర్నాథ్, శంకర, విజయ్, హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకుని గుత్తి ఆర్ఎస్‌లోని పత్తికొండ రోడ్డు కూడలిలో ఉన్న విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జెవివి జిల్లా నాయకులు శ్రీధర్ గౌడ్, కంబగిరి రాముడు, మండల కార్యదర్శి వెంకటరామిరెడ్డి, యుటిఎఫ్ మండల కార్యదర్శి అహోబిలేసు, ఎస్‌టియు నాయకులు మాదన్న, టిడిపి మండల, పట్టణ కన్వీనర్లు బర్దివలి, రవి గౌడ్, నాయకులు శ్రీకాంత్ చౌదరి, దిల్కాశీనా, అబ్దుల్ జిలాన్, కష్ణ, వీరేష్, శ్రీనివాస్ యాదవ్, సుధాకర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎపి పెన్షనర్ల రాష్ట్ర కార్యాలయంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు కె.అబుబకర్, ఉపాధ్యక్షురాలు స్వర్రాంబ, కార్యదర్శి రామ్మోహన్, అదనపు కార్యదర్శి జన్నే కుళ్లాయిబాబు, నాయకులు నారాయణశెట్టి, లక్ష్మీనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం : మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకుని మండలంలోని నంజాపురం ఎంపిపి పాఠశాలలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఎస్ఎంసి ఛైర్మన్ బాలు, ప్రధానోపాధ్యాయులు వన్నూరుస్వామి, ఉపాధ్యాయుడు రామాంజనేయులు, వికలాంగుల సంఘం అధ్యక్షుడు చిత్తయ, అంగన్‌వాడీ కార్యకర్త చంద్రమ్మ, ఆశా కార్యకర్త లక్ష్మి, సిబిటి టీచర్ ఈరన్న, తిప్పేస్వామి, గోపాల్, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

వైసిపి జిల్లా కార్యాలయంలో పూలేకు నివాళులర్పిస్తున్న నాయకులు

రాయదుర్గం : మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకుని మంగళవారం రాయదుర్గం పురపాలక కార్యాలయంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పోరాళుశిల్ప ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర రైతు విభాగం ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, మున్సిపల్ వైస్‌ఛైర్మన్లు శ్రీనివాసయాదవ్, వలిబాషా, కౌన్సిలర్లు శ్రీనివాసరెడ్డి, తట్టే మంజునాథ, గౌని లావణ్య, శ్రీలక్ష్మి, ఐనాపురం మంజునాథ, శారద, పోరాళుగోవిందరాజులు, కొంతం దేవరాజు, మున్సిపల్ మేనేజర్ కిషోర్, వార్డు ఇన్‌ఛార్జి పోరాళుశివ, భీమనపల్లి దివాకర్, అరవా శివప్ప, శ్రీరామిరెడ్డి, బషీర్, రామాంజనేయులు, ఇస్మాయిల్, తదితరులు పాల్గొన్నారు. అలాగే ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాయదుర్గం డివిజన్ కార్యదర్శి మల్లెల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

శెట్టూరు : మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకుని మంగళవారం మండల కేంద్రంలోని ఆర్‌డిటి పాఠశాలలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఎంఆర్‌పిఎస్ ఉపాధ్యక్షులు టైలర్ వన్నూరుస్వామి, నాయకులు తిప్పేస్వామి, బిఎస్‌పి మహిళా అధ్యక్షురాలు ఐదుకల్లు నాగమ్మ, ఎంఎస్.హనుమంతరాయుడు, ఆదిశేషు, రమేష్, కిష్టప్ప, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకుని మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిబాపూలే బిసి గురుకుల పాఠశాలలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ సంగీతకుమారి మాట్లాడుతూ జ్యోతిరావు పూలే సేవలు ఎనలేనివన్నారు. అనంతరం విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం : సమాజానికి జ్యోతిరావు పూలే చేసిన సేవలు మరువలేనివని మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతురాచౌదరి అన్నారు. పూలే జయంతి సందర్భంగా మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు చౌళం మల్లికార్జున, పాపంపల్లి రామాంజినేయులు, ఆర్జీ శివశంకర్, గోళ్ల వెంకటేశులు, షర్మస్, కొల్లాపురప్ప, కునే సాయినాథ్, తదితరులు పాల్గొన్నారు.

జెఎన్‌టియులో పూలేకు నివాళులర్పిస్తున్న విసి రంగజనార్ధన, సిబ్బంది

అనంతపురంలో నిర్వహించిన పూలే జయంతి కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్టీసీ కడప జోన్ ఛైర్‌పర్సన్ మంజుల ఓబులేసు

గుత్తిలో నివాళులర్పిస్తున్న దృశ్యం

బ్రహ్మసముద్రంలో పూలేకు నివాళులర్పిస్తున్న దృశ్యం

ఎస్‌కెయులో పూలేకు నివాళులర్పిస్తున్న విసి రామకృష్ణారెడ్డి